# మానవ హక్కుల వైతాళికురాలు

భారతదేశంలో మొట్టమొదటి సాంఘిక విప్లవకారుడు మహాత్మా జోతిరావు ఫూలే సహధర్మచారిణి సావిత్రిబాయి ఫూలే కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న జన్మించింది. ఎనిమిదేళ్ళ వయస్సులో జోతిరావు ఫూలేకి భార్య అయింది. ఆయన ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సాంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి, దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే.

ఆధిపత్య కులాల బెదిరింపులకు, ఒత్తిళ్ళకు భయపడి జోతిరావు ఫూలే తండ్రి ఫూలే దంపతులను ఇంటి నుంచి వెళ్ళగొట్టారు. అయినా వారు తమ వ్యక్తిగత సుఖసౌక్యాలను పక్కనపెట్టి పీడితుల విముక్తికి, ప్రత్యామ్నాయ సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ నిర్మాణానికి జీవితాంతం అంకితమై అలుపెరుగని పోరాటం చేయటం ఎంత అద్భుతమయిన విషయమో ఒక్కసారి ఆలోచించండి. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు

విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమిష్టిగా పోరాటం సలిపిన తీరు మన అందరికీ ఆదర్శనీయం, అనుసరణీయం.

ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే. ఆనాటి సాంఘిక దురాచారాలలో ఒకటైన బాల్యవివాహాల కారణంగా వితంతువులైన మహిళలపట్ల ఆనాటి సమాజం చాలా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేది.

నిర్బంధ లైంగిక సంబంధాల వల్ల గర్భవతులయ్యే అమాయక యువతులను సాంఘిక బహిష్కరణకు, అవమానాలకు గురిచేసే హింసాత్మక ఛాందస సాంప్రదాయాలు కొనసాగుతుండేవి! విధిలేని పరిస్థితుల్లో ఎందరో వితంతువులు భ్రూణహత్యలకు పాల్పడి కష్టాలపాలయ్యేవారు. ఈ ప్రమాదాల నుంచి వితంతువులైన తల్లులను రక్షించేందుకు ఫూలే దంపతులు 1853లో ఒక శరణాలయాన్ని స్థాపించారు. విద్యావ్యాప్తితో పాటుగా ఈ బాధ్యతను కూడా

భుజానవేసుకుని నిర్వహించారు. వితంతువులకు శిరోముండనలు చేయమంటూ క్షురకుల చేత తిరుగుబాటు చేసేటట్టుగా చైతన్యపరిచి 1860లో వారిచేత సమ్మె చేయించింది సావిత్రిబాయి ఫూలే. బ్రాహ్మణీయ శాసనాల ఆధిపత్యం నుంచి శూద్రులను, అతి శూద్రులను విముక్తి చెయ్యటం వాళ్ళకు మానవ హక్కుల చైతన్యాన్నిచ్చి, మానసిక, మతపరమైన బానిసత్వాల నుంచి స్వేచ్ఛ కల్పించటం కోసం 1873లో సత్యశోధక సమాజ్ స్థాపించారు ఫూలే దంపతులు.

1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు ఫూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు.

సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా ంసపుటి 'కావ్యఫూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. 1890, నవంబర్ 28న మహాత్మాఫూలే మరణించారు. ఆమె దత్తపుత్రుడు డాక్టర్ యశ్వంత ఫూలే చితికి నిప్పు పెట్టనివ్వకుండా నిరోధించిన ఆనాటి బ్రాహ్మణీయ మతఛాందసులకు చెంపదెబ్బలా సావిత్రిబాయి తానే స్వయంగా చితికి నిప్పుపెట్టింది. భర్త చితికి నిప్పు పెట్టడమనేది మన భారతదేశ చరిత్రలోనే అరుదైన సంఘటన. భర్త మరణానంతరం సత్యశోధక సమాజ బాధ్యతలన్నింటిని సావిత్రిబాయి స్వీకరించింది.

1897లో పూణేలో ప్లేగు వ్యాధిగ్రస్తులకు రాత్రింబవళ్ళు అవిశ్రాంతంగా సేవచేసిన కరుణామయి! ఆ అంటువ్యాధుల కారణంగా తాను మరణిస్తానని తెలిసి కూడా ఆ రోగులకు సేవ చేస్తూనే 1897 మార్చి 10న ఆమె శాశ్వతంగా కన్నుమూసింది. ఆనాటి సమాజంలో సామాజిక విప్లవకారుడైన భర్త జోతిరావు ఫూలేకు తోడూ నీడగా నడవడమే గాక, ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ, గొప్ప సృజనశీలిగా, స్ఫూర్తిదాయినిగా ఎదిగిన ఉపాధ్యాయిని. స్వతంత్ర వ్యక్తిత్వం గల నాయకురాలు, ధీరవనిత, తాత్వికురాలు, కవయిత్రి. సావిత్రిబాయి జీవితం ఆదర్శవంతంగా తరతరాలుగా నిలిచే వుంటుంది.

